సాక్షి కామారెడ్డి

బుధవారం । 12 । జూలై । 2023



ఉద్యోగ భద్రత కోసం..
ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది.
- 9లో ▸



మొక్కల పెంపకంపై దృష్టి
మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు.
- 9లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 34.5 /23.8
ఆకాశం మేఘావృతమవుతుంది. చలిగాలులు వీస్తాయి. జిల్లాలోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

డిగ్రీ కాలేజీ అధ్యాపకురాలికి డాక్టరేట్



శ్రావణి

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న చరిత్ర విభాగం అధ్యాపకురాలు డి.శ్రావణి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా పొందారు. అసఫ్ జాహీల కాలంలో హైదరాబాద్ రాష్ట్రంలో వ్యవసాయ పరిస్థితులు మరియు జనాభాపై వాటి ప్రభావం (1724–1948) అంశంపై ఆమె పరిశోధన చేశారు. ఇందుకుగాను డి.శ్రావణికి ఉస్మానియా యూనివర్సిటీ మంగళవారం పీహెచ్‌డీ ప్రకటించింది.

మంత్రి కేటీఆర్ బీబీపేటను సందర్శించాలి



బీబీపేట: త్వరలో కోనాపూర్‌లో పాఠశాలను ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్ బీబీపేటను కూడా సందర్శించి జూనియర్ కళాశాల ప్రకటన చేయాలని జూనియర్ కళాశాల సాధన సమితి సభ్యులు కోరారు. మంగళవారం జూనియర్ కళాశాల సాధన సమి తి ఆధ్వర్యంలో బీబీపేటలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మూడేళ్ల క్రితం మండలంలో జూనియర్ కళాశాల ఏ ర్పాటు చేస్తామని మంత్రులు కేటీఆర్, సబి తా ఇంద్రారెడ్డి, ప్రశాంత్‌రెడ్డిలు హామీ ఇచ్చా రన్నారు. కానీ ఇప్పటికీ ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ రికార్డు కోసం..

- కన్యాకుమారి టూ కశ్మీర్ వరకు బిహార్‌కు చెందిన వ్యక్తి సైకిల్ యాత్ర



కామారెడ్డి టౌన్: గిన్నిస్ బుక్ రికార్డు కోసం కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ఓ వ్యక్తి సైకిల్ యాత్ర కొనసాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ఆయన కామారెడ్డి జిల్లాకు చేరుకున్నాడు. బీహార్ రాష్ట్రం పాట్నా జిల్లా కేంద్రానికి చెందిన దివ్యాంగుడు సంతోష్ కుమార్ మిశ్రా జూన్ 23న తమిళనాడు కన్యాకుమారి నుంచి సైకిల్‌యాత్ర ప్రారంభించాడు. 45 రోజుల్లో 4,100 కిలోమీటర్ల సైకిల్ యాత్రతో కాశ్మీర్‌కు చేరుకుంటానని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధిస్తానని పేర్కొన్నాడు. దేశంలో ప్రభుత్వాలు యోగా, క్రీడా, విద్యారంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



భిక్కనూరు: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకులు మాట్లాడుతూ ప్రభుత్వం తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, సునీత, నిరంజన్, శ్రీకాంత్, దిలీప్, వైశాలి శ్రీమాత పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలో విద్యార్థి సంఘాల నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు సురేష్, అరుణ్, విశాల్, పెరుమాండ్ల బుల్లెట్, ఫయాజ్, అల్తాఫ్, అనిల్, దినేష్, సరిచంద్, సచిన్, నవీన్ పాల్గొన్నారు.



నిజాంసాగర్ మండలంలో తారురోడ్డు మీద వెళ్తున్న కేజ్‌వీల్ ట్రాక్టర్

కేజ్‌వీల్స్‌తో తారుమారు!

గ్రామాల్లో వరినాట్లు వేగవంతం అయ్యాయి. పొలాలను దమ్ము చేసే పనిలో భాగంగా కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు ఇష్టారీతిన తిరుగుతుండడం రోడ్లకు గండంగా మారింది. వీటిని నియంత్రించడం అధికారులకు సవాలుగా మారింది. కేజీవీల్స్‌కు రక్షణగా పట్టీలు, హాఫ్ కేజ్‌వీల్స్ వాడాల్సి ఉన్నా ఇవేమీ పట్టనట్లు ట్రాక్టర్ యజమానులు వ్యవహరిస్తున్నారు. దీంతో సంవత్సరాల పాటు నిలవాల్సిన రోడ్లు కొద్దిరోజులకే ధ్వంసం అవుతున్నాయి.

- వేసిన కొద్దికాలానికే పాడవుతున్న రోడ్లు
- రూ. కోట్ల ప్రజాధనం వృథా
- ప్రత్యామ్నాయాలు చూపితేనే మేలు

సాక్షి, కామారెడ్డి: రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వాలు ప్రతియేటా రూ. వందల కోట్లు కేటాయిస్తున్నాయి. మంజూరైన నిధులతో తారు రోడ్లు వేస్తున్నారు. అయితే రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు తిరుగుతుండడంతో రోడ్లు కొంతకాలానికే పాడవుతున్నాయి. వర్షాకాలం సీజన్ రావడంతోనే రైతులు వరి సాగు కోసం బురదపొలం దున్నడానికి కేజ్‌వీల్ ట్రాక్టర్లను వాడుతున్నారు. ఇనుప పట్టీలతో తయారు చేసిన కేజ్‌వీల్స్ రోడ్డుపై తిరిగిన చోటల్లా తారు లేచిపోతోంది. కొన్నిచోట్ల అయితే పదుల సంఖ్యలో కేజ్‌వీల్ ట్రాక్టర్లు తిరగడం మూలంగా రోడ్లు కొద్ది కాలానికే నాశనం అవుతున్నాయి. తారు లేచిపోయి గుంతలు ఏర్పడుతున్నాయి. ఏటా రోడ్ల నిర్వహణ కోసం ప్రభుత్వాలు రూ. కోట్లు మంజూరు చేస్తుండగా, కేజ్‌వీల్స్ తిరిగినపుడల్లా దెబ్బతినిపోయి ప్రజాధనం వృథా అవుతోంది. ఇదే సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో 922 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. రోడ్ల నిర్మాణానికి గత తొమ్మిదేళ్ల కాలంలో రూ. 1,100 కోట్లు ఖర్చు చేసినట్టు ఇటీవల దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రగతి నివేదికలో ప్రకటించారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ పరిధిలో మరో వెయ్యి కిలోమీటర్ల రోడ్లు ఉన్నాయి. రోడ్లపై గుంతలు ఏర్పడినపుడల్లా ప్రభుత్వం వాటి మెయింటెనెన్స్ కోసం రూ. కోట్లు మంజూరు చేస్తుండడం, తర్వాత మళ్లీ కేజ్‌వీల్స్ తిరిగి గుంతలు పడడం సర్వసాధారణమైంది.

ప్రత్యామ్నాయ మార్గాలపై అవగాహన కల్పించాలి

కేజ్‌వీల్స్ తిరగొద్దని చెబుతున్న యంత్రాంగం ప్రత్యామ్నాయ పద్ధతులపై అవగాహన కల్పించాలి. కానీ అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదు. దీంతో కేజ్‌వీల్స్‌తో కూడిన ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. ట్రాక్టర్ యజమానులతో సమావేశాలు ఏర్పాటు చేసి కేజ్‌వీల్స్‌కు బదులు ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించేలా అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. హాఫ్ కేజ్‌వీల్స్‌తో పాటు కేజ్‌వీల్స్‌కు పట్టీలు తొడిగించడం ద్వారా రోడ్లు దెబ్బతినకుండా చూడొచ్చు.

రోడ్లమీద విచ్చలవిడిగా..

రోడ్ల మీద విచ్చలవిడిగా కేజ్‌వీల్స్ తిరగడం మూలంగా రోడ్లు 'తారు'మారవుతున్నాయి. చాలాచోట్ల తారు లేచిపోయి గుంతలు ఏర్పడి ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. రోడ్ల మీద కేజ్‌వీల్స్ తిప్పొద్దంటూ పెద్దపెద్ద బోర్డులు ఏర్పాటు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్ల నిర్మాణంతో పాటు, నిర్వహణకు రూ. వందల కోట్లు ఖర్చు చేస్తుండగా కేజ్‌వీల్స్ మూలంగా రోడ్ల రూపే మారిపోతోంది. వరి సాగు చేసే అన్ని ప్రాంతాల్లో కేజ్‌వీల్స్ సమస్య ఉంది. రోడ్ల మీద కేజ్‌వీల్స్ తిరిగినపుడల్లా తారు తుక్కవుతోంది. ఫలితంగా రోడ్లు దెబ్బతినిపోయి గుంతలు ఏర్పడనున్నాయి.

కట్టడి చేయకుంటే కష్టమే..

కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్లమీద తిరగాలంటే కచ్చితంగా కేజ్‌వీల్స్‌కు పట్టీలు తొడగాలని, లేదంటే హాఫ్ కేజ్‌వీల్స్ మాత్రమే వాడేలా కట్టడి చేస్తే గానీ పరిస్థితుల్లో మార్పు వచ్చేట్టులేదు. రెవెన్యూ, పోలీస్, ఆర్ అండ్‌బీ, వ్యవసాయ శాఖల అధికారులు ఎక్కడికక్కడ రైతులకు నిబంధనలు కచ్చితంగా పాటించేలా వారిని కట్టడి చేస్తే గానీ కేజ్‌వీల్స్‌ను కట్టడి చేయలేమని ఓ అధికారి 'సాక్షి'తో పేర్కొన్నారు. కొన్నిచోట్ల పోలీసులు కేజ్‌వీల్ ట్రాక్టర్లు రోడ్లపై కనిపిస్తే జరిమానాలు విధిస్తున్నారు.

హాఫ్ కేజ్‌వీల్స్ వాడాలి

కేజ్‌వీల్స్‌తో బీటీ రోడ్లు దెబ్బతింటున్నాయి. కేజ్‌వీల్స్‌కు బదులు హాఫ్ కేజ్‌వీల్స్ వాడాలని చెబుతున్నాం. కేజ్‌వీల్స్‌కు పట్టీలు దొరుకుతాయి. వాటిని తొడిగితే కూడా ఏ ఇబ్బంది ఉండదు. రోడ్లు వేసిన కొన్నాళ్లకే దెబ్బతినడానికి కేజ్‌వీల్స్ కారణమవుతున్నాయి. మా వైపు నుంచి రైతులకు అవగాహన కలిస్తాం. అందరూ బాధ్యత తీసుకుని కట్టడి చేయాలి.
–జాలిగామ శ్రీనివాస్, డీఈ, ఆర్‌అండ్‌బీ

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్‌ఎస్!

- ఉచిత విద్యుత్తుపై మాటల మంటలు
- నేడు పోటాపోటీ ఆందోళనలు
- జిల్లాలో వేడెక్కిన రాజకీయం

సాక్షి, కామారెడ్డి: అధికార బీఆర్‌ఎస్ పార్టీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీల మధ్య 'కరెంటు' మంటలు అంటుకున్నాయి. అమెరికా పర్యటనలో ఉన్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు సరఫరా విషయంలో రైతులకు అన్యాయం చేసేలా మాట్లాడాడని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ బుధవారం గ్రామగ్రామాన కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేయాలని పిలుపునిచ్చింది. కాగా 24 గంటల పాటు రైతులకు ఉచిత విద్యుత్తు అంటూ 12 గంటలు కూడా ఇవ్వకుండా రైతులను మోసం చేశారని, తొమ్మిదేళ్లలో రూ. 60వేల కోట్ల అప్పుల్లో ముంచారని ఆరోపిస్తూ సబ్‌స్టేషన్ల వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. ఉచిత విద్యుత్తు విషయంలో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. దీనిపై ఇరు పార్టీలు ఆందోళకు పిలుపునివ్వడంతో రాజకీయం వేడెక్కింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇరు పార్టీలు పోటాపోటీ ఆందోళనలకు పిలుపునిచ్చాయి. అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకులంతా ఆందోళనల్లో పాల్గొననున్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో పెద్దఎత్తున నిరసనలు తెలపడానికి పార్టీ నేతలు నిర్ణయించారు. కాంగ్రెస్ పార్టీ కూడా సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలకు దిగనుంది.

ఎన్నికలు సమీపిస్తుండడంతో..

అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో రాజకీయ పార్టీలు ఏ అంశాన్ని వదులుకోవడం లేదు. ప్రత్యర్థుల ఎత్తులను తిప్పికొట్టేలా వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈ సమయంలో ప్రతి అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నారు. వ్యవసాయానికి ఉచితంగా అందిస్తున్న విద్యుత్తు విషయంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను బీఆర్‌ఎస్ తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఉచిత విద్యుత్తుకు వ్యతిరేకమని, 8గంటల కరెంటు ఇస్తామని చెప్పడం ద్వారా రైతులకు అన్యాయం చేస్తోందని బీఆర్‌ఎస్ ఆరోపిస్తోంది. అయితే ఉచిత కరెంటు పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 60 వేల కోట్లు అప్పులు చేసిందని, పెద్ద ఎత్తున డబ్బులు దుర్వినియోగం అయ్యాయని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

మహోన్నత సేవా పథకానికి ఎస్పీ ఎంపిక

- ఉత్తమ సేవా పథకాలకు పలువురు జిల్లా అధికారులు



ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాల అధికారులకు ఉత్తమ సేవా పథకాలను మంగళవారం సాయంత్రం ప్రకటించింది. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో మహోన్నత సేవా పథకానికి కామారెడ్డి జిల్లా ఎస్పీ బి.శ్రీనివాస్ రెడ్డి ఎంపికయ్యారు. అంతేకాకుండా జిల్లాకు చెందిన పలువురు అధికారులు ఉత్తమ సేవా పథకాలకు ఎంపికయ్యారు. ప్రభుత్వం పోలీసుల శాఖలోని అన్ని విభాగాలకు, ఫైర్ సిబ్బందికి ఉత్తమ అవార్డులను ప్రకటించింది. వాటిలో ప్రధానమైన మహోన్నత సేవ పథకానికి కామారెడ్డి ఎస్పీ ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ సేవల విభాగంలో కామారెడ్డి ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఎస్సై సయ్యద్ మొయినుద్దీన్, ఏఎస్సై ఉత్తమ్ రావు, హెడ్ కానిస్టేబుల్ సీహెచ్.సంగయ్య, టెక్నికల్ విభాగంలో పనిచేస్తున్న సీఐ చింతలపూడి శ్రీనివాస్, ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ అబ్దుల్ మాజీద్ ఎంపికయ్యారు. అంతేకాకుండా మద్నూర్ ఫైర్ స్టేషన్‌లో ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న వినోద్ కుమార్ ఉత్తమ సేవా పథకానికి ఎంపికయ్యారు. అవార్డులకు ఎంపికైన అధికారులను పలువురు అభినందించారు.

లింగంపేట సొసైటీలో కుంభకోణం!

- ధాన్యం కొనుగోళ్ల మెయింటెనెన్స్ పేరుతో రూ. లక్షలు స్వాహా!
- నిధుల దుర్వినియోగంపై గతేడాది ఉన్నతాధికారులకు డైరెక్టర్ల ఫిర్యాదు
- విచారణ చేపట్టిన అధికారులు
- చైర్మన్, సీఈవోలకు నోటీసులు జారీ



లింగంపేట వ్యవసాయ సహకార సంఘం

లింగంపేట: లింగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కుంభకోణం జరిగినట్లు అధికారుల నివేదికలో తేలింది. విండో పాలక వర్గ సభ్యుల తీర్మానం లేకుండానే సొసైటీ నిధులు చైర్మన్, సీఈవో దుర్వినియోగం చేసినట్లు గతేడాది జూలై 5న పీఏసీఎస్ డైరెక్టర్లు రాష్ట్ర కో–ఆపరేటివ్ సొసైటీ కమిషనర్‌కు, జిల్లా సహకార అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రాష్ట్ర, జిల్లా సహకార అధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టారు. 2020–21, 2021–22 సంవత్సరంలో లింగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఖర్చు చేసిన నిధుల వివరాలకు సంబంధించిన రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విండో ఆదాయ వ్యయాలకు సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను తీసుకున్నారు. ఏడాది కాలంగా విచారణ చేసిన అధికారులు గత నెల 20న లింగంపేట సింగిల్ విండో సీఈవో, చైర్మన్‌లకు నోటీసులు అందజేశారు. నెల రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే అప్పటి నుంచి సీఈవో సందీప్ సెలవులో వెళ్లిపోవడం గమనార్హం. అయితే నోటీసు ప్రతులను సంఘ మహాజన సభ ఏర్పాటు చేసి ఇవ్వాల్సి ఉండగా అధికారులు గోప్యంగా ఉంచారు. దీంతో వైస్‌చైర్మన్ మాకం రాములు, డైరెక్టర్లు డీసీవో కార్యాలయానికి మంగళవారం వెళ్లగా అధికారులు విచారణ నివేదిక వివరాలను అందజేశారు.

నివేదిక ఆధారంగా సొసైటీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, సీఈవో సందీప్ ఇద్దరు కలిసి రూ. 73,08,322 దుర్వినియోగం చేసినట్లు డైరెక్టర్లు ఆరోపిస్తున్నారు. అయితే ఈ నెల 20వ తేదీలోగా సింగిల్ విండో మహాజన సభ ఏర్పాటు చేసి రైతుల సమక్షంలో నిధుల దుర్వినియోగంపై చర్చించి నివేదికను ఆమోదించినది లేనిది తెలపాలని డీసీవో వసంత ఆదేశాలు జారీ చేశారు.

ఇబ్బందుల్లో పాలన!

- అద్దె, అరువు భవనాల్లో డివిజన్, మండల కార్యాలయాలు
- అసౌకర్యాల మధ్య కార్యకలాపాలు
- ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాలు కరువు



రామారెడ్డిలో పాత పంచాయతీ భవనంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్



ఎల్లారెడ్డిలో అద్దె భవనంలో కొనసాగుతున్న డీఎస్పీ కార్యాలయం

సాక్షి, కామారెడ్డి: పరి'పాలన' ప్రజల చెంతకు తీసుకెళ్లే ఉద్దేశంతో ప్రభుత్వం కొత్త జిల్లాలతో పాటు రెవెన్యూ డివిజన్లు, రెవెన్యూ మండలాలను ఏర్పాటు చేసింది. అయితే కలెక్టరేట్ సముదాయంతో పాటు జిల్లా పోలీసు కార్యాలయాలకు ఆధునిక హంగులతో భవనాలు నిర్మించిన ప్రభు త్వం డివిజన్, మండల కార్యాలయాలను విస్మరించింది. దీంతో డివిజన్ స్థాయిలో ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాలు, మండల స్థాయిలో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు అద్దె భవనాలు, అరువు భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. జిల్లాలోని ఎల్లారెడ్డిలో డివిజన్ కార్యాలయాలను అరువు, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఆర్డీవో కార్యాలయం స్త్రీశక్తి భవనంలో కొనసాగుతుండగా, డీఎస్పీ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఆయా శాఖల కార్యాలయ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు కాలేదు. బాన్సువాడలో ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరై ఇటీవలే శంకుస్థాపన చేశారు.

కొత్త మండలాల్లో ఇబ్బందులు

రామారెడ్డి మండలం ఏర్పాటైన తర్వాత పోలీస్‌స్టేషన్‌ను పాత పంచాయతీ భవనంలో ఏర్పాటు చేశారు. ఇప్పటికీ అందులోనే కొనసాగుతోంది. తహసీల్దార్ కార్యాలయాన్ని సొసైటీ భవనంలో, మండల పరిషత్ కార్యాలయాన్ని మండల విద్యావనరుల భవనంలో నిర్వహిస్తున్నారు. బీబీపేటలో మండల పరిషత్ కార్యాలయం విద్యావనరుల భవనంలో, తహసీల్దార్ కార్యాలయం సొసైటీ భవనంలో కొనసాగుతున్నాయి. ఐకేపీ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. గతేడాది నవంబర్‌లో ఏర్పాటైన డోంగ్లీ మండలంలో తహసీల్దార్ కార్యాలయాన్ని రైతు వేదికలో ఏర్పాటు చేశారు. ఇంకా మండల పరిషత్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లు మంజూరు కాలేదు. అలాగే ఇటీవలే ప్రారంభించిన పాల్వంచ మండలంలో కూడా తహసీల్దార్ కార్యాలయం ఒక్కటే మంజూరై దాన్ని రైతు వేదిక భవనంలో ప్రారంభించారు. పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ కార్యాలయాలు మంజూరు కాలేదు. పెద్ద కొడప్‌గల్‌లో తహసీల్దార్ కార్యాలయం పాత గ్రామ పంచాయతీ భవనంలో, మండల పరిషత్ కార్యాలయం మండల విద్యావనరుల కేంద్ర భవనంలో ఏర్పాటు చేశారు. పోలీస్‌స్టేషన్‌ను పశు వైద్య శాఖ భవనంలో ఏర్పాటు చేశారు.

పంచాయతీలదీ అదే పరిస్థితి..

ప్రభుత్వం కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసినా భవనాలకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో చాలాచోట్ల పంచాయతీ కార్యాలయాలు అద్దె భవనాలు, పాఠశాల భవనాల్లో కొనసాగుతున్నాయి. 2018 ఆగస్టు 2న జిల్లాలో 214 కొత్త పంచాయతీలు ఏర్పాటయ్యాయి. అయితే చాలా గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గిరిజన తండాల్లో అయితే గుడిసెల్లో కూడా పంచాయతీలు నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల సర్పంచ్‌ల ఇళ్లల్లో కొనసాగుతున్నాయి. పంచాయతీ భవనాలకు కొన్నింటిని నిధులు మంజూరై పనులు కొనసాగుతున్నాయి. అన్ని పంచాయతీల భవనాలకు నిధులు మంజూరు కావాల్సిన అవసరం ఉంది.

కొండపోచమ్మ నీటితో 'సాగర్'కు భరోసా

- ఐదు టీఎంసీలకు ప్రభుత్వ అనుమతి
- జిల్లా నీటిపారుదలశాఖ సీఈ శ్రీనివాస్



ప్రాజెక్టు నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న సీఈ

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ఆయకట్టు కోసం కొండ పోచమ్మసాగర్ నుంచి 5 టీఎంసీల నీటి విడుదలకు సీఎం కేసీఆర్ అనుమతి ఇచ్చారని జిల్లా నీటి పారుదలశాఖ సీఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రస్తుతం కొండపోచమ్మ సాగర్‌లో 9 టీఎంసీల నీరు నిల్వ ఉందని నిజాంసాగర్ ఆయకట్టు అవసరాల మేరకు 5 టీఎంసీల నీటిని విడుదల చేసుకుంటామన్నారు. మంగళవారం నిజాంసాగర్ ప్రాజెక్టును సీఈ సందర్శించి వరద గేట్ల పనితీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారి జూన్‌లో నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదల చేశామని, ఆయకట్టు కింద 1.5 లక్షల ఎకరాల్లో ముందస్తు పంటలు సాగు చేశారని పేర్కొన్నారు. జూన్‌లో ప్రాజెక్టుల నుంచి ఆయకట్టుకు పంటల సాగుకు నీటిని విడుదల చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం మూడు టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. అలీసాగర్ రిజర్వాయర్ వరకు ఉన్న 1.15 లక్షల ఎకరాలతో పాటు మరో 35వేల ఎకరాలకు నిజాంసాగర్ ప్రాజెక్టు నీరు అందిస్తున్నామని చెప్పారు. ఆయకట్టు కింద వరినాట్లు 90శాతం మేర పూర్తయ్యాయని చెప్పారు. ఆయన వెంట నీటిపారుదలశాఖ ఈఈ సోలోమాన్, ఎఈ శివప్రసాద్, వర్క్ ఇన్స్‌పెక్టర్ కాశీనాథ్ తదితరులున్నారు.

నవాబ్‌అలీ దేశానికి ఆదర్శం

నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ దేశానికి ఆదర్శమని జిల్లా నీటిపారుదలశాఖ సీఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు గుల్‌దస్తా వద్ద నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ విగ్రహానికి పూలమాలలు వేసి తెలంగాణ ఇంజినీర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ నవాబ్ అలీ ఆధ్వర్యంలో నిర్మించిన ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్, వైరా, నిజాంసాగర్‌లు వందేళ్లయినా చెక్కు చెదరకుండా ఉన్నాయన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఇస్రోజివాడి నాయకులు

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ మరో నాలుగు నెలల్లో అధికారంలోకి రావడం ఖాయ మని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి మండలం ఇస్రోజివాడికి చెందిన గౌడ నవీన్ ఆధ్వర్యంలో 40 మంది, కామారెడ్డి పట్టణం 30వ వార్డులో పద్మ ఆధ్వర్యంలో 35 మంది బీఆర్‌ఎస్, బీజేపీలకు రాజీనామా చేసి మంగళవారం కాంగ్రెస్ లో చేరారు. వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు అందరూ ఏకతాటిపై ఉండి సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తుందన్నారు. చేయూత పథకం కింద ప్రతినెలా రూ. 4వేల పింఛన్ అందజేస్తామన్నారు. మహిళలకు రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్, రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ, నిరుద్యోగులకు నెలకు రూ. 4వేల నిరుద్యోగ భృతి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ. 5లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, నాయకులు గూడెం శ్రీనివాస్, చందు, సందీప్, డీకే స్వామి, శంకర్, నర్సింలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యాసంస్థల బంద్

నిజామాబాద్‌అర్బన్: నేడు జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో వారు బంద్‌కు పిలుపునిచ్చారు.

బీసీ రాజకీయ ప్లీనరీని విజయవంతం చేయాలి



బాన్సువాడ రూరల్: హైదరాబాద్‌లో ఈనెల 15న హైదరాబాద్‌లో జరుగనున్న బీసీల రాజకీయ ప్లీనరీని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం ప్రతినిధులు మంగళి విజయ్, రాఘవ, నవీన్, సాయితేజలు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం కరపత్రాలు ఆవిష్కరించారు. జనాభాలో 60 శాతంపైగా ఉన్న బీసీలంతా ఏకమైతేనే హక్కులు సాధించుకోవడానికి వీలవుతుందన్నారు. రాహూల్, సాయి, సతీష్, గోపాల తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీ



బాన్సువాడ: చోరీకి గురైన సెల్‌ఫోన్లను సీఈఐఆర్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు బాన్సువాడ సీఐ మహేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో 9మంది బాధితులు ఫిర్యాదు చేయగా, వారికి సెల్‌ఫోన్లను అప్పగించారు. గుర్తు తెలియని వ్యక్తులు సెల్‌పోన్లు అమ్మేందుకు ప్రయత్నిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని అన్నారు. సిబ్బంది రాజు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా డిగ్రీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం ప్రారంభమైన డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ అరుణ తెలిపారు. ఈ పరీక్షల్లో 3158 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 2744 మంది హాజరైనట్లు ఆమె తెలిపారు. 414 మంది విద్యా ర్థులు గైర్హాజరైయ్యారన్నారు.

స్కీం పేరుతో స్కాం

- లక్కీడ్రాలో బహుమతులంటూ నిర్వాహకుల ప్రచారం
- వేలసంఖ్యలో చేరిన సభ్యులు
- కాలపరిమితి ముగిసినా బహుమతులు ఇవ్వని నిర్వాహకులు



మోర్తాడ్(బాల్కొండ): మా స్కీంలో చేరితో లక్కీ డ్రా ద్వారా కారు, ట్రాక్టర్, మోటార్ సైకిల్, ఫ్రిజ్, టీవీ మరెన్నో బహుమతులను గెలుచుకునే అవకాశం ఉందంటూ నిర్వాహకులు ప్రచారం నిర్వహించి, వేల సంఖ్యలో సభ్యులను చేర్చుకున్నారు. ప్రస్తుతం స్కీం కాలపరిమితి ముగిసి ఏడాదిన్నర కావస్తున్నా, లక్కీడ్రాలో గెలిచినవారికి బహుమతులను పంపిణీ చేయలేదు. దీంతో స్కీంలో చేరిన సభ్యులు నిండా మునగడంతో, ఆవేదన చెందుతున్నారు. ఇదంతా మోర్తాడ్ మండలం దొన్కల్ కేంద్రంగా సాగిన ఓ లక్కీడ్రా నిర్వాహకుల తతంగం.

రూ.3.50 కోట్లు వసూలు..

2020లో స్కీం ప్రారంభించగా 16 నెలల కాలపరిమితితో 2021లో ముగిసిపోయింది. దాదాపు 3వేల మందిని సభ్యులతో స్కీంను కొనసాగించారు. ఒక్కో సభ్యుడు నెలకు రూ.వెయ్యి చొప్పున, 16 నెలల పాటు రూ.16వేలు చెల్లించాడు. ప్రతి నెలా లక్కీ డ్రా నిర్వహించగా గెలిచినవారు మాత్రమే పూర్తిస్థాయిలో సొమ్ము చెల్లించలేదు. మెజార్టీ సభ్యులు మొత్తం నెలల పాటు డబ్బులను చెల్లించారు. ఈ స్కీం నిర్వహణతో దాదాపు రూ.3.50 కోట్ల వరకు వసూలు చేశారు. పక్కాగా బహుమతులను పంపిణీ చేసినా నిర్వాహకులకు రూ.1కోటి వరకు మిగులుతుంది. 1,500ల మందికి డ్రాలో గెలుపొందిన విధంగా బహుమతులను అందించిన స్కీం నిర్వాహకులు మిగిలిన 1,500ల మందికి చేతులెత్తివేశారు. ప్రస్తుతం స్కీం నిర్వాహకుల చుట్టూ తమ బహుమతుల కోసం సభ్యులు చెప్పులు అరిగేలా తిరుగుతూనే ఉన్నారు. అయినప్పటికీ డ్రాలో గెలిచినవారికి బహుమతులు ఇవ్వకుండా కనీసం వారికి డబ్బులు వాపసు ఇవ్వకుండా వేధిస్తూనే ఉన్నారు.

మంత్రి వద్దకు పంచాయితీ..

స్కీం నిర్వాహకులు వసూలు చేసిన సొమ్మును రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెట్టి సభ్యులకు మాత్రం చుక్కలు చూపుతున్నారు. సొమ్మును తమ సొంత వ్యాపారాలకు మళ్లించడంతో సభ్యులకు మొండిచేయి చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్వాహకుల్లో ఇద్దరు అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందినవారు ఉన్నారు. వీరు డబ్బులను రియల్ ఎస్టేట్‌కు మళ్లించగా విభేదాలు వచ్చాయి. ఈ పంచాయతీని ఎలాగైనా పరిష్కరించాలని ఒక నాయకుడు మంత్రి ప్రశాంత్‌రెడ్డి వద్ద మొరపెట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. స్కీం పేరుతో చేసిన దగా వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తుందని, మంత్రి సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తుంది. కానీ నిధులను పక్కదారి పట్టించిన నాయకులలో ఒకరు మాత్రం ఎలాంటి స్పందన లేకుండా ఉండటంతో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని అటు సామాన్య ప్రజలు, ఇటు బీఆర్ఎస్ నాయకులు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు.

పక్కాగా విచారణ జరిపించాలి

లక్కీడ్రాల పేరుతో స్కీంలను నిర్వహించి, అమాయకులైన ప్రజల నుంచి విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేసిన నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈఅంశంపై పక్కాగా విచారణ జరిపించాలి. అక్రమాలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలి.
–ముత్యాల రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మోర్తాడ్

ప్రెస్ పేరిట బెదిరింపులపై ఫిర్యాదు




ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న రైస్‌మిల్ యజమాని.. పోలీస్ స్టేషన్ తరలి వచ్చిన రైస్ మిల్లర్లు

భిక్కనూరు: ప్రెస్ పేరిట కొందరు తమ రైస్‌మిల్లులోకి అక్రమంగా ప్రవేశించి తమను ఇబ్బందులకు గురిచేశారని మండలంలోని కాచాపూర్ గ్రామంలోని వెంకటరమణ రైస్‌మిల్లు యజమాని మాశెట్టి బాలాజీ మంగళవారం భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్‌కు పిర్యాదు చేశాడు. ఈనెల 10న సంగమేశ్వర్ గ్రామానికి చెందిన రాజేందర్, రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన నాగరాజు, అన్నారం గ్రామానికి చెందిన రాజు తమ రైస్‌మిల్లులోకి ప్రవేశించి, మేము ప్రెస్ వాళ్లం, మాకు డబ్బులు ఇవ్వాలంటూ బెదిరించారని పేర్కొన్నారు. తాము న్యాయంగా వ్యాపారం చేస్తున్నా, అక్రమంగా వ్యాపారం చేస్తున్నారంటూ, డబ్బుల కోసం బెదిరించారన్నారు. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ వివరించారు.

పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన రైస్‌మిల్లర్స్..

విలేకరుల పేరుతో కొందరూ తమ రైస్‌మిల్లులకు వచ్చి డబ్బులు కావాలని డిమాండ్ చేస్తూ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని వారి నుంచి తమను కాపాడండి అంటూ భిక్కనూరు మండల రైస్‌మిల్లుల యజమానులు భిక్కనూరు పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. తాము న్యాయంగా వ్యాపారం చేస్తున్నప్పటికీ డబ్బులు డిమాండ్ చేస్తూ మానసికంగా బాధపెడుతున్నారన్నారు. వారి బెడద నుంచి రక్షించమని ఎస్సైని కోరారు.

మంచిప్ప అడవిలో ఎలుగుబంటి సంచారం!

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్ప అటవీ ప్రాంతం శివారులో ఎలుగుబంటి సంచరిస్తోందని, ఇటీల పంట పొలాల వైపు వెళ్లిన రైతులకు కనిపించిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈవిషయం గ్రామస్తులకు తెలియడంతో మంచిప్పతోపాటు శివారు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారమందించారు. వారు ఎలుగుబంటి సంచరించిన ప్రాంతాలను పరిశీలించారు. పాదముద్రలను సేకరించారు. ఎలుగుబంటి గ్రామాలకు రాకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

యూపీ వ్యవసాయ కూలీ అదృశ్యం

నిజామాబాద్ సిటీ: ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ కూలీ పనిచేసేందుకు వచ్చి అదృశ్యమైనట్లు నిజామాబాద్ రూరల్ ఎస్సైలింబాద్రి మంగళవారం తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 40 మంది వ్యవసాయ కూలీలు జూన్ 28న రూరల్ మండలం తిర్మన్‌పల్లి గ్రామానికి వచ్చారు. వారిలో చత్రపాల్ అనే కూలీ ఈ నెల 7నుంచి కనిపించకుండపోయాడు. తోటి కూలీలు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో చత్రపాల్ సోదరుడి కొడుకు రామ్ చరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోడు పట్టాల్లో లోటుపాట్లు సరిచేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జగన్, నాయకులు

సుభాష్‌నగర్: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోగల పోడు భూముల పట్టాలలో లోటుపాట్లు జరిగాయని, వాటిని వెంటనే సరిచేయాలని ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి నాగూరావుతో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. పోడు భూముల అటవీహక్కు పట్టాలలో జరిగిన లోపాలను జగన్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో చాలామంది లబ్ధిదారులకు పోడు పట్టాలు ఇంకా రావాల్సి ఉందన్నారు. ఇచ్చిన హక్కు పట్టాల్లో కూడా చాలా వరకు సాంకేతిక లోపాలు ఉన్నాయని, వీటినంత త్వరగా వాటిని సరిచేయాలని కోరారు. అలాగే మిగిలిపోయిన లబ్ధిదారులకు కూడా పోడు పట్టాలు త్వరగా పంపిణీ చేయాలన్నారు. స్పందించిన అదనపు కలెక్టర్ త్వరలోనే ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులతో గ్రామ, డివిజన్, జిల్లాస్థాయిలో మరోసారి సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ప్రజాప్రతినిధులు, నాయకులు రమేష్ నాయక్, మాన్‌సింగ్, రాజేందర్, ప్రేమ్ నాయక్, లక్ష్మీనారాయణ, నరేష్, గోపాల్‌రెడ్డి, చింత శ్రీనివాస్‌రెడ్డి, కోర్వ దేవేందర్, తిరుమల్, అంబర్‌సింగ్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో అపచారం

- ఆలయం వద్ద మాంసం ముక్కలు
- పోలీసుల అదుపులో నిందితుడు



ఎస్సైకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి సమీపంలోని బారడి పోచమ్మ ఆలయంలో సోమవారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మాంసం, ఎముకలు పెట్టి అపచారం చేశారని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం ఆలయానికి వెళ్లిన కొందరు భక్తులు వాటిని గమనించడంతో, గ్రామపెద్దలు గ్రామంలో ర్యాలీ తీసి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. కాగా అక్కడ మద్నూర్‌కు చెందిన షేక్ అతీఫ్ ఆధార్‌కార్డు జిరాక్స్ ఉండడంతో అతడిని పట్టుకొని చర్యలు తీసుకోవాలని వారు ఎస్సైతో పేర్కొన్నారు.

అక్రమ కేసులో ఇరికించాలనే..

డోంగ్లీ మండల కేంద్రానికి చెందిన షాదుల్ సోమవారం రాత్రి బారడి పోచమ్మ ఆలయం ముందు మాంసం, ఎముకలు పెట్టినట్లు తెలిందని ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. షాదుల్, మద్నూర్‌కు చెందిన అతీఫ్ ఇద్దరు బావబావమరుదులని, ఇద్దరి మధ్య కొన్ని నెలలుగా తగాదాలు కొనసాగుతున్నాయన్నారు. అతీఫ్‌ను అక్రమ కేసులో ఇరికించాలనే షాదుల్ ప్లాన్ వేసి సోమవారం రాత్రి బారడిపోచమ్మ ఆలయానికి వచ్చి మాంసం, ఎముకలు, తన వద్ద ఉన్న అతీఫ్ ఆధార్‌కార్డు జిరాక్స్ పెట్టి వెళ్లిపోయాడన్నారు. షాదుల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

తాళంవేసిన రెండిళ్లల్లో చోరీ

- 19.5 తులాల బంగారం, రూ. లక్షల నగదు అపహరణ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని గౌడ్స్ కాలనీతో పాటు సరస్వతి నగర్ కాలనీలోని తాళం వేసిన రెండిళ్లలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. పట్టణ ఎస్ఐ పీటర్ తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని గౌడ్స్ కాలనీలో నివాసం ఉంటు మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న రఫీ తన కుటుంబ సభ్యులతో సోమవారం సిద్దిపేట్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి, మంగళవారం తెల్లవారుజామున తిరిగివచ్చారు. ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువాలో దాచిన 12 తులాల బంగారం, రూ. ఒక లక్ష 28వేల నగదును దుండగులు చోరీ చేశారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించడంతో పాటు క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.

సరస్వతి నగర్ కాలనీలో...

పట్టణంలోని సరస్వతీ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న గోషిక రాజ తన కుటుంబసభ్యులతో ఐదు రోజుల క్రితం తీర్థయాత్రలకు వెళ్లారు. అతడి బావమరిది సురేష్ ఐదురోజులుగా రాత్రిళ్లు రాజ ఇంట్లోనే పడుకునేవాడు. సోమవారం రాత్రి వర్షం పడడంతో రాలేదు. మరుసటి రోజు ఉదయం రాజ ఇంటికి వెళ్లగా ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూశాడు. బీరువాలో ఉన్న ఏడున్నర తులాల బంగారంతో పాటు రూ. 50వేల నగదును దుండగులు చోరీ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

కేజ్‌వీల్ ట్రాక్టర్ల సీజ్...



మోర్తాడ్: రోడ్లపై నడుపుతున్న మూడు కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను మోర్తాడ్ పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. తిమ్మాపూర్ మార్గంలో కేజ్‌వీల్స్ ఉన్న ట్రాక్టర్లు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై తిరుగుతుండటంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయనే ఉద్దేశ్యంతో వీటిని సీజ్ చేశారు. ట్రాక్టర్లను తగిన ఏర్పాట్లు చేసుకుని తిప్పాలని ఎస్సై ముత్యంరాజు సూచించారు. నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: మండలంలోని తూంపల్లి గ్రామ పరిధిలో తారు రోడ్డును ధ్వంసం చేసిన కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. సోమవారం తూంపల్లి నుంచి పాకాల మార్గంలో పెట్రోలింగ్ చేస్తుండగా తూంపల్లి గ్రా



మానికి చెందిన జింక అజయ్ కేజ్‌వీల్ ట్రాక్టర్‌ను తారు రోడ్డుపై నడుపుతున్నాడన్నారు. దీంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధర్పల్లి మండలంలో..



ధర్పల్లి: మండలంలోని రామడుగు గ్రామ శివారులో రహదారిపై తిరుగుతున్న కేజ్‌వీల్ ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బానిస బతుకులు వద్దు



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజు

కామారెడ్డి అర్బన్: రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను బానిసలు చేసి పరిపాలించాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బెట్టింకి బాల్‌రాజు అన్నారు. మంగళవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇక బానిస బతుకులు వద్దని ఆయన సూచించారు. నాయకులు హరిలాల్‌నాయక్, తమ్మడి స్వామి, దుంపల సురేష్, దుబ్బాక శంకర్, మొగ్గం నవీన్, రాజు, చరణ్, పెంటయ్య, నవీన్, స్వామి, నందు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి కూలీ మృత్యువాత



మృతిచెందిన షేక్ రహీం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగాస్థాన్ 1లో కొత్తగా నిర్మిస్తున్న ఓ అపార్టుమెంట్‌లో కూలి పనిచేస్తున్న షేక్ రహీం (33) ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందినట్లు ఎస్సై లింబాద్రి మంగళవారం తెలిపారు. మహారాష్ట్ర దెగ్లూర్‌కు చెందిన షేక్ రహీం అపార్టుమెంట్ పై అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి తండ్రి షేక్ మెయిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ పలువురి మృతి



నరేష్ (ఫైల్)

మాచారెడ్డి: ప్రమాదవశాత్తు మంటల్లో పడి తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. పాల్వంచ మండల కేంద్రానికి చెందిన తోట నరేష్(33) సోమవారం ఇంటి ముందు వేసిన పందిరి పబ్బు (కొమ్మలు) తగలబెడుతుండగా ప్రమాదవశాత్తు మంటల్లో పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

భిక్కనూరు మండలంలో వివాహిత..


భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన దివ్య (22) సోమవారం కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. తీవ్రంగా గాయపడిన దివ్యను స్థానికులు కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియ ఆస్పత్రికి తరలించగా, మార్గమధ్యలోనే మృతి చెందిందని అక్కడివె వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా దివ్యకు వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని ఆమె భర్త రమేష్, నడిపి మామ బాలయ్య, బావ బాల్‌రాజులు తరచు వేధించేవారని, ఈ విషయం తమకు చెబుతు తరుచు బాధపడేదని దివ్య సోదరుడు పరుశరాంలు పోలీసులకు పిర్యాదు చేశాడు. తమ సోదరి మృతికి ఈ ముగ్గురే కారణమని రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

సదాశివనగర్‌లో గుర్తుతెలియని వృద్ధురాలు..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని దగ్గి గ్రామ శివారులోగల 44వ జాతీయ రహదారిపై సోమవారం ట్రక్ ఢీకొన్నఘటనలో తీవ్రంగా గాయపడ్డ గుర్తుతెలియని వృద్ధురాలు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై తోట రాజేశ్ తెలిపారు. సదరు వృద్ధురాలు గత కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా రోడ్డు వెంబడి తిరుగుతుండేదని స్థానికులు పేర్కొన్నారు. ఈక్రమంలో సోమవారం రహదారిపై ఆమెను ట్రక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు.

కోటగిరి మండలంలో..



రుద్రూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గుర్తుతెలియని వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా.. కోటగిరి పరిధిలోని సులేమాన్‌నగర్ శివారులో ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ గుర్తు తెలియని వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. మృతురాలు మహారాష్ట్రకు చెందిన మహిళగా భావిస్తున్నామన్నారు. వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఫోన్ మాట్లాడుతుండగా గుండెపోటు..



తిరుపతి (ఫైల్)

మాచారెడ్డి: ఫోన్ మాట్లాడుతూనే ఓ యువకుడు గుండెపోటుతో కుప్ప కూలి ప్రాణాలు వదిలిన ఘటన మంగళవారం మండలంలోని గజ్యానాయక్ తండా పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గజ్యానాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చంద్రునాయక్ తండాకు చెందిన కనికరం తిరుపతి(38) మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్ వద్ద ట్యాంకర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సదరు కాంట్రాక్టర్ లచ్చాపేట, బండ రామేశ్వరపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద తిరుపతి ఫోన్ మాట్లాడుతూ గుండె పోటుతో కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు తిరుపతిని స్థానిక వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి..

నవీపేట: మండలంలోని మహంతం రైల్వే గేటు సమీపంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి(42) మృతి చెందినట్లు రైల్వే పోలీసులు మంగళవారం తెలిపారు. మృతుడు రైలు తలుపుల దగ్గరగా కూర్చుండగా, ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెంది ఉండవచ్చని వారు పేర్కొన్నారు. మృతుడు నలుపురంగు ప్యాంట్, నీలి రంగు చొక్కా ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు.

మాల్తుమ్మెదలో ఒకరి అదృశ్యం



నాగభూషణం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన నాయికోటి నాగభూషణం(48)అనే వ్యక్తి అదృశ్యం అయినట్లు ఏఎస్సై ఉమేశ్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన నాగభూషణం సోమవారం ఉదయం మెదక్ వెళ్లివస్తానని చెప్పి ఇంటి నుండి బయల్దేరాడు. ఇప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతని గాలించారు. అయినా ఫలితం లేకపోవడంతో మంగళవారం నాగభూషణం భార్య నాయికోటి భాగ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ముషీర్‌నగర్‌లో వివాహిత

సిరికొండ: మండలంలోని ముషీర్‌నగర్ గ్రామానికి చెందిన అల్లెపు ఎల్లవ్వ(40) అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై నర్సింలు మంగళవారం తెలిపారు. ఈ నెల 9న ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిన ఎల్లవ్వ ఇప్పటికీ తిరిగి రాలేదన్నారు. దీంతో ఆమె భర్త రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోతుల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడ్డ భైరయ్య

రామారెడ్డి: మండల కేంద్రంలో కోతుల మంద ఒక్కసారిగా దాడి చేయడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. రామారెడ్డి గ్రామానికి చెందిన నామాల భైరయ్య(45) ఇంట్లోకి వెళుతుండగా ఒక్కసారిగా కోతుల గుంపు భైరయ్యపై పడి దాడి చేసి గాయపరిచాయి. వెంటనే స్థానికులు వచ్చి కోతులను తరమడంతో ప్రాణాపాయం తప్పింది. గాయపడ్డ భైరయ్యను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మార్చిలో నర్సవ్వ అనే వృద్ధురాలు కోతుల దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మరువకముందే మరోసారి కోతుల మంద వ్యక్తిపై దాడి చేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. కోతుల గుంపును గ్రామం నుంచి తరిమేయాలని, తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హోటల్ యజమానిపై కేసు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): హోటల్‌లో బాలుడితో పనిచేయిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట రాజేశ్ మంగళవారం తెలిపారు. మండలంలోని పద్మాజీవాడి చౌరస్తా వద్ద గల హోటళ్లను ఎస్సై తోట రాజేశ్ ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్ టీం తనిఖీలు చేశారు. ఓ హోటల్‌లో పని చేస్తున్న బాలుడిని గుర్తించి హోటల్ నిర్వాహకుడు సయ్యద్ పత్తాపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

మాచారెడ్డి: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి కామారెడ్డి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ 200 జరిమానా విధించినట్లు మాచారెడ్డి ఎస్సై రాజా రమేష్ మంగళవారం తెలిపారు. మండలంలోని బండ రామేశ్వరపల్లి గ్రామానికి చెందిన అంబాల రమేష్‌పై మూడు నెలల కిందట డ్రంకన్‌డ్రైవ్ కేసు నమోదు కాగా మంగళవారం కోర్టులో హాజరు పర్చగా జడ్జి శిక్ష విధించినట్లు ఎస్సై వివరించారు.